ప్రజాశక్తి

శనివారం 12 జులై 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

రైతాంగానికి పెద్దపీట

- వ్యవసాయానికి తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-పుల్లలచెరువు

రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తోందని, వ్యవసాయ రంగానికి తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. శుక్రవారం ఆయన పుల్లలచెరువు మండలంలోని ఐటీవరం గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దివంగత ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు అధ్యక్షత వహించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఎరిక్షన్‌బాబు స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోవటం చాలా బాధేసిందన్నారు. అయినప్పటికీ ప్రజలతోనే ఉండి కష్టపడి పని చేస్తున్నాడని చెప్పారు. 2029లో యర్రగొండపాలెంలో మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ ప్రాంతంలో చెంచులకు కరెంటు ఇచ్చి వారి ఇళ్లలో వెలుగులు నింపామని తెలిపారు. ఐటీవరం ▶ 2లో

తేనెతుట్టెలా ఇళ్లస్థలాల సమస్య

- గత ప్రభుత్వం ఇచ్చిన వాటిల్లో అనర్హులే.. 20 వేల మందిగా లెక్కలు..
- ఇప్పుడు కొత్తగా కుప్పలు తెప్పలుగా పేదల నుంచి దరఖాస్తులు
- పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్లు ప్రకటించిన ప్రభుత్వం
- ఏడాదిగా ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వని కూటమి సర్కార్



టిడ్కో ఇళ్లు.. (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పేదలకు ఇళ్లస్థలాల వ్యవహారం రాజకీయ వివాదంలో చిక్కుకుంది. ఇంకా చెప్పాలంటే ఇది తేనెతుట్టెలా మారింది. ఎన్నికలకు ముందు వైసిపి ప్రభుత్వం ఎక్కడపడితే అక్కడ ప్రభుత్వ, ప్రైవేటు భూములను సేకరించి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఊరికి దూరంగా ఉన్నందున ఎక్కువశాతం మంది ఇళ్లు కూడా కట్టుకోలేదు. పైగా సెంటు భూమి మాత్రమే ఇవ్వడంతో దానిపై పేదలకు కూడా ఆసక్తి లేదు. ఎన్నికల సమయానికి వీటిని ఇచ్చారు. జగనన్న లేవుట్ల పేరుతో ఇచ్చిన వాటిల్లోనూ చాలా వరకూ ఇళ్లు కట్టుకోలేదు. సగంలోనే ఆగిపోయాయి. ఎన్నికల సమయంలో ఒంగోలు పట్టణంలో ఇచ్చినవన్నీ ఆగిపోయాయి. ఇలా ఇళ్లస్థలాల వ్యవహారం ఎటూ తేలలేదు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్లస్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన సెంటు భూమిలో ఇళ్లు ఎలా కట్టుకోవాలనే సందేహంతో ఉన్న పేదలు కూటమి నేతల హామీతో ఖాళీగానే ఉంచారు. ఇప్పుడు ఆగిపోయిన వారంతా కూటమి సర్కారు ఇస్తామన్న స్థలాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇక కొత్తగానూ వేలాది మంది నుంచి ధరఖాస్తులు వస్తున్నాయి. గతంలో తెలుగుదేశం ముద్ర పడిన వారందరినీ పక్కనబెట్టారనే విమర్శలున్నాయి. ఇప్పుడు వారి నుంచి దరఖాస్తులు అందుతున్నాయి. జాబితాలు సిద్ధం చేస్తున్నారు. అయితే ఇప్పటికే ఇచ్చిన వాటిని ఏం చేయాలనే దానిపైనా స్పష్టత లేదు. గతంలో స్థలం పొందిన వారిని ఏం చేస్తారన్నది సందిగ్ధంగా మారింది. రద్దు చేసి కొత్తగా పట్టణాల్లో

రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్లు ఇస్తారనే ఆశతో ఉన్నారు. అయితే ఏడాది గడిచినా ఇళ్ల స్థలాలపై ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. ఎందుకంటే పాత వాటిపై ఓ నిర్ణయానికి రావాల్సి ఉంది. ఈ పాటికే నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు పూర్తి చేసుకోవాల్సిందే. అసలు మొదలు పెట్టని వారంతా ఇప్పుడు ఏం చేయాలనేదీ స్పష్టత ఇవ్వాలి. సెంటులోనే కట్టుకోవాలా? లేక రద్దు చేసి రెండు సెంట్లు ఇస్తారా? అనే దాని కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో 620 లేఅవుట్లు వేశారు. ప్రైవేటు భూములను సేకరించారు. మండలాల్లో ప్రభుత్వ భూముల్లోనే ఇచ్చారు. చాలా చోట్ల వాగులు, వంకల సమీపంలో ముంపు ప్రాంతాల్లో ఇవ్వడంతో ▶ 2లో



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజ్యాంగంపై అవగాహన అవసరం

▶ 8లో



రాష్ట్రంలో మాయా కూటమి పాలన

▶ మెయిన్ 6లో

ఖరీఫ్ సాగుకు సమాయత్తం

- పూర్తి కాని కాలువ మరమ్మతు పనులు
- కొమ్మమూరు కాలువకు సాగునీటి విడుదలలో జాప్యం



సాగుకు దుక్కు దున్నుతున్న రైతు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. గత కొద్దిరోజులుగా అక్కడక్కడా వర్షాలు పడుతున్న నేపథ్యంలో దుక్కులను సాగుకు సన్నద్ధం చేస్తున్నారు. జిల్లాలోని రేపల్లె వ్యవసాయ డివిజన్‌లో వ్యవసాయ బోర్లు ఉన్న రైతులు వెద పద్ధతిలో వరి సాగు చేపట్టారు. కానీ కృష్ణా, పశ్చిమ డెల్టాకు కొమ్మమూరు కాలువ ద్వారా సాగునీటి సరఫరా విషయంలో స్పష్టత లేదు. దీంతో వరి సాగు ఎప్పటినుంచి అనే విషయమై స్పష్టత లేదు. వేసవిలోనే కొమ్మమూరు కాలువల మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉండగా వర్షాలు మొదలయ్యాక ఆలస్యంగా జూన్ నెలలో పనులు ప్రారంభించారు. టెండర్లు లాంటివి ఏమీ లేకుండా రూ.10 లక్షల లోపు పనులను నామినేషన్ పద్ధతిపై సాగునీటి సంఘాలకు అప్పజెప్పారు. పనులు చేపట్టడంతో జరిగిన జాప్యం కారణంగా జూలై నెల మొదటి వారానికి కూడా పనులు పూర్తి కాలేదు. కాంక్రీట్ పనులు పూర్తి కావడానికి మరింత సమయం పట్టేలా ఉంది. అప్పుడప్పుడూ వర్షాలు కూడా పడుతున్న క్రమంలో పనులు మరింత ఆలస్యం అవుతున్నాయి. పశ్చిమ డెల్టా పరిధిలో 746 కాలువ మరమ్మతు పనులకు రాష్ట్రప్రభుత్వం రూ.25 కోట్ల నిధులు కేటాయించడం జరిగింది. కానీ పనులు ఆశించిన మేరకు జరగడం లేదు. ఈ కారణంగా ఈ నెలాఖరుకు కూడా కొమ్మమూరుకు సాగునీరు విడుదలయ్యే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగు ఆలస్యమయేలా ఉంది.

జిల్లాలో ఖరీఫ్‌లో వరి సాగు సాధారణ విస్తీర్ణం 2,53,790 ఎకరాలుగా ఉంది. ఆహార ధాన్యాలు, వాణిజ్య పంటలు ▶ 2లో

అధైర్యపడొద్దు..నేనున్నా..

- మరియమ్మ కుటుంబాన్ని దత్తత తీసుకున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ



మరియమ్మ కుటుంబంతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-మద్దిపాడు

పేదరికంలో ఉన్న ఆ కుటుంబానికి 'నేను అండగా ఉంటా..' అని ముందుకొచ్చారు జిల్లా కలెక్టర్ (ఇన్‌ఛార్జి) ఆర్.గోపాలకృష్ణ. పి-4 ప్రభుత్వ ఆలోచనలో భాగంగా వ్యక్తిగతంగా తాను కూడా పేదలకు అండగా నిలుస్తానని ముందుకొచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం మద్దిపాడు మండలం, మల్లవరం గ్రామంలో ఆయన పర్యటించారు. దళితురాలైన గొల్లపాటి మరియమ్మ కుటుంబాన్ని కలెక్టర్ సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో కూర్చుని ప్రత్యేకంగా వారితో మాట్లాడారు. తన భర్త చనిపోయారని, కుమార్తె, కుమారుడు ఉన్నారని, కూలి పనులు చేసుకునే తమకు సొంత ఇల్లు కూడా లేకపోవడంతో తల్లిదండ్రుల వద్ద ఉంటున్నట్లు మరియమ్మ ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. వారి కుటుంబ పరిస్థితిని, ఆర్థిక స్థితిని అడిగి తెలుసుకున్న కలెక్టర్... వారసత్వంగా వచ్చిన స్థలంలో కట్టుకోవడానికి తక్షణమే ఇల్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంటి నిర్మాణానికి ▶ 2లో

తేనెతుట్టెలా ఇళ్లస్థలాల సమస్య..

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. అధికారుల ఒత్తిళ్లతో సగం కట్టి వదిలేశారు. అప్పట్లో 1.25 లక్షల మంది అర్హులుగా తేల్చారు. అయితే 84 వేల మందికే పట్టాలు ఇచ్చారు. ఇళ్లను మంజూరు చేశారు. ఒంగోలు నగరంలో 20,800 మందికి పట్టాలు ఇచ్చారు. పట్టణానికి సమీపంలో ఎన్.అగ్రహారం, వెంగముక్కలపాలెం వద్ద రైతుల భూములను సేకరించారు. హడావుడిగా సెంటుతో ప్లాట్లు వేసి కాగితాలు చేతిలో పెట్టారు. అప్పటి సిఎం జగన్మోహన్‌రెడ్డి పట్టాలు పంపిణీ చేశారు. ఎన్నికలు రాగానే అవన్నీ ఆగిపోయాయి. ఒక్కరూ వాటిల్లో ఇల్లు కట్టుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఎన్నికల ప్రచారంలోనే తాము అధికారంలోకి రాగానే రెండు సెంట్లు ఇస్తామని ప్రకటించారు. పేదలందరూ రెండు సెంట్లపై ఆశగా ఉన్నారు. అయితే వైసిపి హయాంలో ఇచ్చిన పట్టాలపై తెలుగుదేశం నేతలు సర్వే చేయించారు. అనర్హులను తేల్చాలని నిర్ణయించారు. రెవెన్యూ అధికారులు బృందాలుగా ఏర్పడి ఇచ్చిన పట్టాలను వెరిఫికేషన్ చేశారు. 84 వేల పట్టాల్లో 20 వేలకు పైగా బోగస్ పట్టాలున్నట్లు తేల్చారు. అనర్హులుగా గుర్తించారు. 4 వేల మంది లబ్ధిదారులు అసలు ఆచూకీ కూడా లేరని తేల్చారు. ఒంగోలు పట్టణంలోనే 10,750 మంది అనర్హులుగా గుర్తించారు. అంటే ఎన్నికలకు ముందు ఇచ్చిన వాటిల్లో సగం మంది అనర్హులేనని తేలడంతో అంతా గందరగోళంగా మారింది. రాజకీయంగానూ ఇక్కడ సంక్లిష్టత ఏర్పడింది. బోగస్ వారిని తప్పించి అర్హులైన వారికి రెండు సెంట్లు స్థలం ఇవ్వాలనే ఆలోచనలో ఎమ్మెల్యే జనార్ధన్ ఉన్నారు. అయితే ఇంకా ఇళ్ల స్థలాలపై ఆయన పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు. ఇక గ్రామాల్లోనూ బోగస్ లబ్ధిదారులను తొలగించే యోచనలో ఉన్నారు. ఏదేమైనా ఈ పాటికే ఇంటి స్థలం పొంది ఇల్లు కట్టుకోని వారికి ఓ స్పష్టత ఇవ్వాలి. దాంట్లోనే కట్టుకోవాలా? లేక కొత్తగా ఇచ్చే వాటిల్లో కట్టుకోవాలా? అనేదీ తెలియడం లేదు. దీంతో ఏడాదిగా ఎవరూ తమకు ఇచ్చిన పట్టాల్లోకి వెళ్లడం లేదు. ఇక టిడ్కో ఇళ్లను అలాగే పెట్టారు. వాటిపైనా స్పష్టత లేదు. శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఏదేమైనా ఇళ్ల స్థలాలపై పాలకపక్ష నేతలు ఓ నిర్ణయానికి రావాల్సి ఉంది. ఏడాది దాటింది. రెండో ఏడాదిలోనైనా వీటిపై దృష్టి సారించాల్సి ఉంది.

అధైర్యపడొద్దు..నేనున్నా..

(మొదటిపేజీ తరువాయి)

అవసరమైన అదనపు సహాయం కూడా చేస్తానని చెప్పారు. జీవనోపాధి కోసం కిరాణా షాపు గానీ, టిఫిన్ షాపు గానీ ఆసక్తి మేరకు మరియమ్మ ఏర్పాటు చేసుకునేటట్లు సహాయం చేస్తానని తెలిపారు. ఆమె కుమార్తెకు క్రాఫ్ట్ వర్క్, టైలరింగ్‌లో ఆసక్తి ఉన్నట్లు తెలుసుకున్న కలెక్టర్.. ఆ రంగంలోనూ రాణించేలా తోడుగా ఉంటానని చెప్పారు. ఇంటర్మీడియట్లో ఆగిపోయిన కుమార్తెను ఆ కోర్సు పూర్తి చేయించేలా చదివిస్తానన్నారు. కుమారుడు పదో తరగతి చదువుతున్నట్లు మరియమ్మ చెప్పారు. పేదరికం నుంచి కుటుంబం బయటపడేలా అవసరమైన సహాయం చేస్తానని వారికి కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా తొలుత నెల రోజులకు సరిపోయేలా కిరాణా సరుకులు, బియ్యం, కూరగాయలను కలెక్టర్ అందించారు.

గ్రామంలో శ్మశాన వాటిక సమస్య ఉందని, మురుగు కాలువలు లేవని స్థానికులు ఈ సందర్భంగా కలెక్టర్ దష్టికి తీసుకొచ్చారు. శ్మశానవాటిక సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానిక తహశీల్దార్ ఆదిలక్ష్మిని ఆయన ఆదేశించారు. దశలవారీగా గ్రామంలో మురుగునీటి కాలువలను తవ్వించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జ్యోతిని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, గ్రామ సర్పంచి సుబ్బారెడ్డి, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

వైసిపి తర్లుపాడు మండల కమిటీకి నేతల ఎంపిక

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు వైసీపీ మండల కమిటీకి పలువురు నేతలు ఎంపికయ్యారు. మండల యూత్ అధ్యక్షులుగా మీర్జాపేట గ్రామానికి చెందిన దేవిరెడ్డి రమేష్‌రెడ్డి, మండల దివ్యాంగుల సంఘం అధ్యక్షులుగా బుడ్డపల్లె గ్రామానికి చెందిన బండారు వెంకటేశ్వర్లు, మండల రైతు విభాగం అధ్యక్షులుగా సీతా నాగులవరం గ్రామానికి చెందిన రేగుల అంకయ్య, మండల ట్రేడ్ యూనియన్ అధ్యక్షులుగా నాయుడుపల్లి గ్రామానికి చెందిన మందాటి మల్లికార్జునరెడ్డిలను నియమిస్తూ శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. మండల కమిటీలో స్థానం దక్కించుకున్న నేతలను పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

ఉపాధ్యాయుల కృషి.. విద్యార్థుల అభివృద్ధి: ఎంఈవో

ప్రజాశక్తి-మర్రిపూడి

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కృషి విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతోందని మండల విద్యా శాఖ అధికారి ఈ. రంగయ్య అన్నారు. మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల వీడ్కోలు సభ, సన్మాన కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులు ఇవి రంగయ్య, యు శ్రీనివాసులు మాట్లాడుతూ ఇక్కడ ఎనిమిది సంవత్సరాలపాటు సర్వీస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు పాఠశాలలో అద్భుతమైన ఫలితాలను సాధించి విద్యార్థులను అభివృద్ధి పథంలో నడిపించారని అన్నారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయడం వలన గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో ఐదు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించారని, రెండో మండల విద్యాశాఖ అధికారి



బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

యు శ్రీనివాసులు తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులు ఎల్ సలోమి, బి మేరీ కరుణమ్మ, సిహెచ్ వీరనారాయణమ్మ, కే సౌందర్య కుమారిలను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారం గోప్యంగా ఉంచాలి: సిఐ

ప్రజాశక్తి-మార్కాపురం

సెల్‌ఫోన్ సిమ్ వినియోగదారుల వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత మీదేనని సిమ్ విక్రయదారులకు మార్కాపురం సిఐ పి సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వివిధ కంపెనీల సిమ్‌కార్డు డిస్ట్రిబ్యూటర్లతో సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐ సుబ్బారావు మాట్లాడారు. వ్యక్తిగత సమాచారం లీక్ కావడంతో ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. వ్యక్తిగత సమాచారం మీ వద్ద గోప్యంగా ఉంచాలన్నారు. ఎంతటి వారు ఒత్తిడి చేసినా ఇవ్వకూడదన్నారు. వ్యక్తిగత సమాచారం ఇచ్చిన వారిపై



మాట్లాడుతున్న సిఐ సుబ్బారావు

కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మార్కాపురం పట్టణ ఎస్ఐ ఎం సైదుబాబు, వివిధ కంపెనీల సిమ్ కార్డుల డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

రైతాంగానికి పెద్దపీట

(మొదటిపేజీ తరువాయి)

గ్రామంలో నాలుగు కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆరు నెలలలో పూర్తి చేస్తామని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి గాలికి వదిలేసిన 220 కేవీ సబ్ స్టేషన్ కూడా పూర్తి చేస్తామన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాలలో వేస్తామని తెలిపారు. యర్రగొండపాలెం నుంచి పుల్లలచెరువు 21 కిలోమీటర్‌కి తారు రోడ్డు వేసేందుకు ప్రభుత్వం నుంచి రూ.2.85 కోట్ల నిధులు విడుదలయ్యాయని వివరించారు. అలాగే యర్రగొండపాలెం నుంచి త్రిపురాంతకానికి కూడా తారు రోడ్డు వేసేందుకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇంకా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, నియోజకవర్గ పరిశీలకులు బ్రహ్మం చౌదరి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తం

(మొదటిపేజీ తరువాయి)

అన్నీ కలిపి జిల్లాలో 3,50,916 ఎకరాల మేర పంటల సాగు ఉంటుందని భావిస్తున్నారు. కానీ మెట్ట పంటల సాగు విషయంలో రైతులు అయోమయ స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం పొగాకు సాగు వద్దంటున్న నేపథ్యంలో పత్తి, శనగ, మిరప, మొక్కజొన్న వీటిలో ఏమి సాగు చేయాలనే విషయమై స్పష్టత లేదు. సాధారణంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో జలవనరుల శాఖ అధికారులు సమావేశం జరిపి కృష్ణా పశ్చిమ డెల్టాలో వరి పంట సాగు కోసం వార్షిక ప్రణాళిక ను రూపొందించి, ఎన్ని టిఎంసిల నీరు పంటల సాగు కోసం విడుదల చేసే అవకాశం ఉందో నిర్ణయించాల్సి ఉంది. దీంతో పాటు సాగర్ కుడి కాలువ ద్వారా మాగాణి సాగుకు ఎంత మేర సాగునీరు ఇచ్చే అవకాశం ఉందో చెప్పాల్సి ఉంది. నాగార్జున సాగర్ ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు పడితేనే డ్యామ్ నిండి దిగువకు సాగునీరు విడుదల అయ్యే అవకాశం ఉంది. శ్రీశైలం డామ్ నుంచి దిగువకు నీటి విడుదల జరుగుతున్న క్రమంలో జలాలు సాగర్‌కు చేరే అవకాశం ఉంది. మరి ఈ సీజన్‌లో పంటల సాగు అవసరాల మేర వర్షాలు కురిసి జలాశయాలు నిండి ఏ మేర సాగునీటి సరఫరా జరుగుతుందో చూడాల్సి ఉంది.

రైతులు వ్యవసాయ సీజన్‌ను భూసార పరీక్షలతో ప్రారంభిస్తారు. రైతాంగం పొలం బాట పట్టడానికి ముందు గ్రామాల వారీగా రైతులకు అవసరం అయిన ప్రాంతాల్లో భూసార పరీక్షలు జరపాలి. పంటల సాగుకు, దిగుబడులకు ఇది కీలకం. రైతాంగ ప్రయోజనాలే ధ్యేయంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా భూసార పరీక్షలు జరగాల్సి ఉంది. ఇందుకు సంభందించిన టెస్టింగ్ కిట్లు గానీ, కెమికల్స్ గానీ లేవు. ఈ కారణంగా భూసార పరీక్షలు రైతులకు అందుబాటులోకి రాలేదు.

పంటల సాగులో మరో ముఖ్యమైన అంశం విత్తనం ఎంపిక. ప్రతి ఏటా రైతులు నకిలీ విత్తనాల కారణంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం నుంచి మేలైన విత్తనాల సరఫరా లేకపోవడంతో రైతులు ప్రైవేట్‌గా విత్తనాలు కొని మోసపోతున్నారు. నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి రాకుండా కఠిన చర్యలు కూడా ఉండడం లేదు. రైతుల అవసరాలకు సరిపడా ప్రభుత్వమే విత్తనాలు సరఫరా చేస్తే మేలు. కాగా విత్తనం నుంచి ఉత్పత్తుల విక్రయం వరకు రైతాంగ శ్రేయస్సే ధ్యేయంగా తెచ్చిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్.బి.కె) నిర్వీర్యం అయ్యాయి.

ఈ కేంద్రాల ద్వారా రైతులు తమకు కావాల్సిన సేవలు ఒకే చోట అందుకోవచ్చునని చెప్పడం జరిగింది. వీటి ద్వారా భూసార పరీక్షలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందిస్తామన్నారు. ఆచరణలో రైతు భరోసా కేంద్రాలు రైతులకు చేరువ అయిన దాఖలాలు లేవు. ఈ ఖరీఫ్ సీజన్‌లో అయినా భూసార పరీక్షలను అందుబాటులోకి తెచ్చి, నాణ్యమైన విత్తనాలు, రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులోకి తేవాలని రైతాంగం కోరుతున్నారు.

రహదారిపై గుంతలు

- వాహన చోదకుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- పిసిపల్లి

ఆర్ అండ్ బి రోడ్డు శిథిలావస్థ చేరింది. దీంతో కొద్దిపాటి లోడుతో వెళ్తున్నా ట్రాక్టర్ల టైర్లు భూమిలోకి దిగబడుతున్నాయి. మండల పరిధిలోని పెద అలవలపాడు ,కంబాలదిన్నె రోడ్డు, పిసిపల్లి ,పెదవరిమడుగు మధ్యలో రోడ్డు దెబ్బ తింది. అక్కడ తారు లేచి కంకర బయటపడి పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. ఈ గోతులలో లోడుతో వెళ్లే ట్రాక్టర్లు దిగబడి పోతున్నాయి. ఇటీవల వేప కర్ర లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ గుంతల దగ్గరకు వచ్చేసరికి సుమారు రెండు అడుగుల మేర దిగుబడి గోతి పడింది. ట్రాక్టర్ భూమిలోకి



రహదారిపై కుంగిన ట్రాక్టర్ టైరు (ఫైల్)

దిగబడింది. దీంతో రోడ్డు శిథిలావస్థకు చేరి గుంతలు పడుతున్నాయి. రోడ్డు అంచులు వైపు గుంతలు పడి ఉండటం, మధ్యలో మెరకగా ఉంది.రోడ్డు లో అక్కడక్కడ ఇలా శిథిలావస్థకు చేరి గుంతలు ఉన్నాయి. రాత్రిపూట ప్రయాణించే వారు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్ర వాహనాల వారు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యత గల రోడ్డులో గోతులు ఉండటం వలన ప్రయాణానికి ఆటంకం కలుగుతుంది. ప్రమాదాలు కూడా చోటు చేసుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై ఏర్పాడిన గుంతలకు మరమ్మతులు చేయించి రాకపోకలకు ఇబ్బందులకు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

రోగ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి -నాగులుప్పలపాడు

ఎక్కువ సమస్యలు ఎదుర్కొనే వ్యక్తులు, హైరిస్క్ వ్యక్తులు హెపటిస్ బి మరియు సి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బివి. సాగర్ తెలిపారు. పరీక్షల్లో నెగిటివ్ వస్తే వారికి మందులు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, బాపట్ల జిల్లా హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సమీకత వ్యూహం దిశ, ఆంధ్రప్రదేశ్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు మండలం నిడమానూరు గ్రామంలో హెప టైటిస్ బి, సి నిర్ధార పరీక్షలు శుక్రవారం నిర్వహించారు. హైరిస్క్ వ్యక్తులకు హెపటైటిస్ బి మరియు సి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కోటేశ్వరావు, స్వచ్ఛంద సంస్థ అవుట్ రిచ్ వర్కర్ ఎం. మల్లేశ్వరి పాల్గొన్నారు.

కొత్తపట్నంలో ఎన్‌హెచ్‌పి సంస్థ ప్రతినిధుల పర్యటన

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండల పరిధిలోని ఎన్‌పిఎంషాప్, వనరుల కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను ఎన్‌హెచ్‌పి సంస్థ ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా అనగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమాన్ని ప్రోత్సహించేందుకు ఎన్ హెచ్ పి సంస్థ ప్రతినిధులు పర్యటించారు. తొలుత ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి ఆధ్వర్యంలో కొత్తపట్నం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రకతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించారు.అనంతరం పురిని మల్లేశ్వరమ్మ పొలాన్ని , వనరుల కేంద్రాన్ని పరిశీలించి, ప్రకతి వ్యవసాయంలో ఉపయోగించే కషాయాలు, ద్రావణాల తయారీ విధానాలు, వాటి ప్రయోజనాలు గురించి అడిగి తెలుసున్నారు. అనంతరం ఈతముక్కల గ్రామంలో ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్కడి అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నపిల్లలతో మాట్లాడారు. ఈ సందర్శన ద్వారా ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్యం, పోషణ అనే అంశాలలో సమగ్ర అవగాహన ఏర్పడినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

రంగారావుకు ఎమ్మెలే నివాళి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఈదుమూడి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపిపి కొండ్రగుంట రంగారావు గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయ్‌కుమార్ శుక్రవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం ఈదుముడి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన పూసపాటి కష్ణమూర్తి పెంకుటిల్లు ను పరిశీలించారు. బాధిత కుటుంబానికి రూ.35 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నివాళులర్పించిన టిడిపి అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్ , సెక్రటరీ కాకర్ల లక్ష్మి వరప్రసాద్ ,క్లస్టర్ ఇన్‌ఛార్జి గుమ్మడి సాయిబాబా , లంబు నాగేశ్వరరావు ,గ్రామ టిడిపి అధ్యక్షులు కుర్రా



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

వీరాంజనేయులు ,ఆళ్ళ ప్రేమ్ చందు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎంపిపి ముప్పవరపు వీరయ్య చౌదరి సతీమణి సుచిత్ర కూడా రంగారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో వెంకట కృష్ణారావు, పున్నారెడ్డి, ఇంటూరి శ్రీనివాసరావు, పాండు రంగరావు, బెల్లం వెంకటేశ్వర్లు, కాట్రగడ్డ బాబు తదితరులు ఉన్నారు.

యువతకు ఉపాధి కల్పించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- దొనకొండ

రాష్ట్రం మరియు దొనకొండలో పరిశ్రమల ఏర్పాటుచేసి నిరుదోగ్య యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కెవి.పిచ్చయ్య కోరారు. స్థానిక రామ్‌నగర్‌లో డివైఎఫ్ఐ కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో కొన్ని లక్షల ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయన్నారు. జిల్లాలోని దొనకొండ పారిశ్రామిక కేంద్రంగా అభివద్ధి చేయాలన్నారు. దర్శిలోని ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కనిగిరి నిమ్సును పూర్తి చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా వార్డు నూతన కమిటీని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న కెవి. పిచ్చయ్య

అధ్యక్షుడిగా బత్తుల భార్గవ్, కార్యదర్శిగా జార్జం సాయి, ఉపాధ్యక్షులుగా కంటా రేవంత్, కంట హేమంత్, సాల్వాది పవన్, సహాయ కార్యదర్శులుగా అయినవోలు ఉదయ సాయి, కంట నారాయణ, సందు శివ, కమిటీ సభ్యుడిగా కళ్యాణ్ ఎన్నికయ్యాడు.

భూసార పరీక్షా పత్రాలు అందజేత

ప్రజాశక్తి- కనిగిరి

కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో 'సాగుకు సమాయత్తం' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రమాదేవి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రైతులకు పొలం పిలుస్తుంది, అన్నదాత సుఖీభవ, డ్రోన్స్ వినియోగం, భూసార పరీక్షలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, డిజిటల్ క్రాప్ సర్వే, పంటల భీమా, పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ, ఉచిత విత్తనాల పంపిణీ వంటి పథకాలపై విస్తృత అవగాహన కల్పించారు. రైతులకు అందుబాటులో ఉంచి సూచనలు, సలహాలు చేసి అధిక దిగుబడులు సాధజంచేలా కృషి చేయాలని తెలిపారు. అనంతరం రైతులకు భూసార కార్డులు, విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జైనులుద్దిన్, ఎఒలు శిల్ప అబ్రహం, రంగ కష్ణ, మధుబాబు, రవికుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ సిబ్బంది, ఎఇఒలు, ఎంపిఒలు, రైతులు పాల్గొన్నారు.

టంగుటూరులో చోరీ

నాలుగు సవర్లు బంగారం అపహరణ

ప్రజాశక్తి-టంగుటూరు

గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి తాళం పగులగొట్టి నాలుగు సవర్ల బంగారు ఆభరణాలు అపహరించారు. ఈ ఘటన టంగుటూరు పురంసెంటర్‌లో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. పురం సెంటర్‌కు చెందిన బడుగు దీనదాసు తన కుటుంబ సభ్యులతో కలిసి నిమ్మకూరులో చదువుతున్న తమ కుమార్తె వద్దకు గురువారం ఉదయం వెళ్లారు. రాత్రి సమయంలో ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. అనుమానంతో లోనికి వెళ్లి చూడగా బీరువా కూడా పగులగొట్టి ఉంది. అందులో దాచిన నాలుగుర సవర్ల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేశాడు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను పిలిపించి ఘటనా స్థలంలో వేలి ముద్రలు, ఇతర ఆధారాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని శింగరాయ ఎకొండ సిఐ చావా హాజరత్తయ్య పరిశీలించారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-అర్ధవీడు :

అడవి పందులు అడ్డురావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని మిట్టమీదపల్లె గ్రామంలోని రంగారెడ్డి కోళ్ల ఫారం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తిరుపతయ్య(70) అనే వ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అందిన వివరాల ప్రకారం.. కంభం మండలం తెల్లదిన్నె గ్రామానికి చెందిన మృతుడు తిరుపతయ్య, మరికొందరు ఆటోలో బొల్లుపల్లి గ్రామంలో మంత్రాలమ్మ గుడికి వస్తున్నారు. ఘటన స్థలం వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తాకొట్టింది. దీంతో తిరుపతయ్య, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ తిరపతయ్య వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ సుదర్శన్‌రావు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-రాచర్ల : రాచర్ల మండలం, ఒద్దులవాగుపల్లె గ్రామ మాజీ సర్పంచి అన్నపురెడ్డి భూపాల్ రెడ్డి(60) ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై శుక్రవారం మరణించారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, వైసిపి గిద్దలూరు నియోజకవర్గ నాయకులు పిడతల ప్రవీణ్ కుమార్‌రెడ్డి, విఆర్‌ఒల సంఘం జిల్లా అధ్యక్షుడు వైపి. రంగయ్య భూపాల్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. నివాళులర్పించిన వారిలో సర్పంచులు, టీడీపీ, వైసిపి నాయకులు ఉన్నారు.

వర్ణ గ్రానైట్‌లో కార్మికుడు మృతి

ప్రజాశక్తి-పొదిలి : గ్రానైట్ రాళ్లు కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పైన పడడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఏలూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. స్థానిక వర్ణ గ్రానైట్ పాలిషింగ్ యూనిట్‌లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, చందౌలి జిల్లా, వారణాసి ప్రాంతంలోని తులసి ఆశ్రమం నోనర్ అనే గ్రామానికి చెందిన సుధమ కుస్వాహా అనే సుధామ కుష్వాహ (30) అనే యువకుడు గ్రానైట్ రాళ్లను కట్ చేస్తున్నాడు. ప్రమాద వశాత్తు రాయి మీద పడడంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పొదిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు స్థలానికి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువుల వనం 'వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల'

- అభ్యుదయ భావాలతో ఆదర్శ పాఠశాల
- 3700 మంది విద్యార్థులతో కొనసాగుతున్న పాఠశాల
- ఎంతోమంది జీవితాలను తీర్చిదిద్దిన చదువుల కేంద్రం
- కార్పొరేట్ సంస్థలకు ధీటుగా నిలిచిన సంస్థ
- నేటికీ ఉన్నత ఆశయాలతో సాగుతున్న పాఠశాల
- నేడు 70వ వార్షికోతవానికి రానున్న పూర్వ విద్యార్థులు



గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల, వ్యవస్థాపకులు కృష్ణయ్య (ఫైల్)

ప్రజాశక్తి - పంగులూరు

'అభ్యుదయ భావాలు, శాస్త్రీయ ఆలోచనలతో సమాజంలోని అసమానతలు దూరం చేసేందుకు ఏడు దశాబ్దాల క్రితం కీర్తిశేషులు ఒలేటి కృష్ణయ్య ఆలోచనలతో రూపుదిద్దుకున్న గంగవరం ఒలేటి కృష్ణ ఉన్నత పాఠశాల 70వ వార్షికోత్సవం' నేడు జరుపుకుంటుంది. చదువు ద్వారా సమాజ మార్పుకు కృషి చేయాలని, సమాజ మార్పుకు చదివే మూలమని గ్రహించిన 'ఒలేటి కృష్ణయ్య' తన ఆస్తిలో కొంత భాగాన్ని ఖర్చు చేసి పాఠశాల నిర్మించారు. 1942లోనే దూర దృష్టితో హిందీ సాంస్కృతిక విద్యాలయాన్ని స్థాపించారు. అందుకోసం 12 ఎకరాల పొలం పాఠశాలకు సమకూర్చారు. ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. హిందీ సంస్కృత విద్యాలయం ప్రారంభించారు. అనంతరం తెనాలి వాస్తవ్యులు శివ లింగయ్య సలహా మేరకు మరొక 12 ఎకరాల పొలం విద్యాలయానికి దానం చేశారు. హిందీ సంస్కృత భాషలపై ప్రోత్సాహం తగ్గినందున 1956లో ఒలేటి కృష్ణయ్య ఓరియంటల్ మిడిల్ స్కూల్ ఏర్పాటు చేశారు. నాలుగేళ్లు గడిచిన అనంతరం 1960లో ఒలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలగా మార్పు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నత పాఠశాలగా రూపాంతరం చెందిన తరువాత గంగవరం పరిసర గ్రామాల్లోని కొన్ని వేల మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు చదువులు అందించి వారి జీవితాలను ఎంతగానో ప్రభావితం చేసింది. ఈ పాఠశాల్లో అన్ని సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు విద్య అందించడమే కాకుండా ఆదర్శభావాలను అందిపుచ్చుకునే విధంగా విద్యాబోధన చేయటం ఈ పాఠశాల ప్రత్యేకత. ఈ పాఠశాల్లో చదివిన అనేక మంది డాక్టర్లు, ఇంజనీర్లు, లెక్చర్లు, లాయర్లు, ప్రొఫెసర్లు వంటి వృత్తులతోపాటు ఉన్నత స్థాయి అధికారులుగా, రాజకీయ నాయకులుగా సేవలు అందిస్తున్నారు. అలాంటి పాఠశాల నేడు 70వ వార్షికోత్సవ వేడుక శనివారం అత్యంత వైభవంగా, ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు.

భవిష్యత్తు ప్రతిపాదిత కార్యచరణ

గంగవరం పరిసర గ్రామాల నుండి విద్యార్థులు పాఠశాలకు వచ్చేందుకు రవాణ సౌకర్యం కల్పించనున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. పాఠశాల్లో జరిగే ట్యూషన్‌కు తోడ్పాటు అందించడం, ట్యూషన్, రోజువారి జరిగే అభ్యసన గురించి తల్లి, దండ్రులు తెలుసుకునేందుకు డైరీ నిర్వహణ, పాఠశాలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి విద్యార్థులకు డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించేందుకు ఒక ఉపాధ్యాయుణ్ణి నియమించడం, సైన్స్ ల్యాబ్ ఆధునీకరణ, విద్యార్థినీ, విద్యార్థులు పోటీ పరీక్షలు ఎదుర్కొనే విధంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. అకాడమిక్, కేరియర్ డెవలప్మెంట్‌కు సంబంధించి, మోటివేషన్ గెస్ట్ లెక్చరర్ తరగతుల నిర్వహణ, ఐఎఫ్‌పి ప్యానల్స్ ప్రతి తరగతికి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రిటైర్డు ఉపాధ్యా యుల స్థానంలో కొత్త ఉపాధ్యాయులను ప్రైవేటుగా నియమించడం, ఇప్పుడున్న పడమర వైపు భవనంపై అంతస్తు, పాఠశాల మైదానం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించనున్నట్లు తెలిపారు.

పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించండి



వలేటి కృష్ణయ్య, పాఠశాల కమిటీ చైర్మన్

పాఠశాల ప్రారంభించి 70వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా పాఠశాల్లో చదువుకొని ఉన్నత స్థానాల్లో, వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరూ శనివారం జరుగుతున్న 70వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనాలని పాఠశాల కమిటీ చైర్మన్ ఒలేటి కృష్ణయ్య కోరారు. పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలు, అనుభూతులను స్నేహితులతో కలిసి పంచుకోవాలని కోరారు. ఇప్పటి వరకు ఉన్నతమైన ఆశయాలతో నాణ్యమైన విద్యను అందిస్తూ కార్పొరేట్‌కు ధీటుగా తమ పాఠశాల విద్యా సేవలు అందిస్తుందని తెలిపారు. ఆధునిక మార్పులకు అనుగుణంగా గంగవరం పరిసర గ్రామాల విద్యార్థులకు చదువులు అందించేందుకు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. ప్రైవేటు సంస్థల పోటీ తట్టుకొని విద్యార్థుల సంఖ్యను మరింత పెంచుకునేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించుకొని, విద్యార్థుల తల్లి, దండ్రులకు పాఠశాల పట్ల నమ్మకం కలిగించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ వేడుకలో పాఠశాల భవితవ్యం, దశ, దిశ కర్తవ్యంగా పూర్వ విద్యార్థులు దృఢ సంకల్పంతో ఆలోచన చేయాలని, ఆచరణకు తగిన కార్యాచరణ రూపొందించాలని కోరారు.

20న కౌలు రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభ

ప్రజాశక్తి - బాపట్ల



పి కొండయ్య

ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభలు కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో ఈ నెల 20న నిర్వహి స్తున్నట్లు కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పి కొండయ్య శుక్రవారం తెలిపారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని, ఏ పంటకు గిట్టుబాటు ధరలేదని పేర్కొన్నారు. పొగాకు రైతుల వెతలు వర్ణనాతీతంగా ఉన్నాయని తెలిపారు. కౌలు రైతుల సమస్యలు మరింత ఎక్కువగా ఉన్నాయని అన్నారు. కౌలు రేట్లు పెంచేస్తుండటంతో వ్యవసాయం భారంగా మారుతుందని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలు అందకపోవడం వంటి సమస్యలు కౌలు రైతులను వేధిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో కౌలు రైతు సమస్యలపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. సభలకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి రామారావు హాజరవుతారని తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20వేలు ప్రతి కౌలు రైతుకు ఇవ్వాలని కోరారు. భూ యజమాని సంతకం తొలగించి గ్రామ సభల ద్వారా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని అన్నారు. వాస్తవ సాగుదారుల పేరుతోనే ఈ క్రాప్ నమోదు చేయాలని, కౌలు రైతులు, సాగుదారుల పంట రుణాలు రీ షెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని సభలో డిమాండ్ చేయనున్నట్లు పేర్కొన్నారు.



మండల పరిషత్తు ఎఒకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఉపాధి హామీ బకాయిలు ఇవ్వాలి

ప్రజాశక్తి - వేమూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు అందాల్సిన వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం సూపరిండెంట్ ఎం అనురాధకు వినతి పత్రం శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి అగస్టిన్ మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులు పని చేసి 8 వారాలు గడిచినప్పటికీ వేతనాలు విడుదల చేయలేదని తెలిపారు. కార్మికులకు ప్రస్తుతం వ్యవసాయ పనులు లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఉపాధి హామీ పని డబ్బు రాకపోవడంతో జీవనం కష్టతరమైందని అన్నారు. వాస్తవానికి ఉపాధి హామీచట్టం ప్రకారం పని చేసిన రెండు వారాల్లోపు కూలీ డబ్బు విడుదల కావాల్సి ఉందని, వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎం ప్రభుదాస్, టి చిన్న అంకమ్మరావు, బి దుర్గారావు, ఆర్ ఏడుకొండలు, టి వెంకటస్వామి పాల్గొన్నారు.



పి4 జాబితా ప్రదర్శిస్తున్న ఎంపిడిఒ శేషమాంబ

పి-4 జాబితాను సరిచూసుకోవాలి


ప్రజాశక్తి - అమృతలూరు

పి4 సర్వే పూర్తి చేసి జాబితాలు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు ఎంపిడిఒ శేషమాంబ తెలిపారు. ప్రతి ఒక్కరూ జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. పి4 సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు అందటానికి దోహదపడుతుందని అన్నారు. ఈ సర్వే జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని, లేనిచో సంబంధిత సచివాలయంలో తెలియపర్చాలని కోరారు.

గురుకులంలో వసతులు కల్పించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. త్రాగునీరు, పారిశుధ్య నిర్వహణ లోపంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హాస్టల్స్ విద్యార్థుల సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం బోజన విరామం సమయంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి ఎం సూర్య ప్రకాష్, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ కార్యదర్శి, డివైఎఫ్‌ఐ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కెవి లక్ష్మణరావు, ఎస్‌ఎఫ్‌ఐ గర్ల్స్ కన్వీనర్ కె భవానీ పరిశీలించినట్లు తెలిపారు. 618 మంది విద్యార్థినులు ఉన్న అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో ఆర్‌ఒ ప్లాంట్ పనిచే యక విద్యార్థులకు త్రాగటానికి మంచినీళ్లు కూడా అందడం లేదన్నారు. కొన్ని సందర్భాల్లో రాత్రిపూట త్రాగేందుకు నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. మోటార్ పని చేయకపోవటంతో వాడుకోవటానికి, స్నానాలకు కింద నుంచే మూడో అంతస్థుకు బకెట్లతో విద్యార్థినులు మోసుకు వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. తమ హాస్టల్ ఆర్‌ఒ ప్లాంట్ ద్వారా త్రాగునీరు వచ్చేలాగా చూడాలని విద్యార్థులు కోరారు. సిబ్బంది తక్కువగా ఉన్నారనే కారణంతో పారిశుద్యం కూడా సక్రమంగా నిర్వహించడం లేదని తెలిపారు. ఫ్లోర్స్ మీద నాచు, ఈగలు తాండవం చేస్తు న్నాయని తెలిపారు. గదికి 41 మంది విద్యార్థులను ఉన్నపటి సరిపడునన్ని ఫ్యాన్లు లేక, డోర్ మిష్‌లు లేకపోవడంతో దోమలు వస్తున్నాయని తెలిపారు. గతంలో పాఠశాలను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పరిశీలించి సమస్యల పరిష్కారం కోసం సూచనలు చేశారని, అదనంగా నిధులు కేటాయించామని చెప్పినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందని విద్యార్థులు ఎస్‌ఎఫ్‌ఐ బృందం దృష్టికి తెచ్చారు. పరిశీలనకు వెళ్ళిన ఎస్‌ఎఫ్‌ఐ బృందం ప్రిన్సిపల్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ బృందం దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కారం కోసం అధికారు లకు వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు. అప్పటికీ పట్టించుకోకపోతే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వై నవీన్, పి నిఖిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీరు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రతి ఇంటికి కుళాయి ద్వారా త్రాగు నీరు అందిస్తామని శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. తీర ప్రాంత గ్రామాలకు త్రాగునీరు అందించే మంచి నీటి చెరువు వద్ద జలజీవన్ మిషన్ పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. రూ.10.22 కోట్ల వ్యయంతో మండలంలోని 37 గ్రామాలకు నిరంతరం త్రాగు నీరు అందించేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అనంతరం మంచినీటి చెరువును పరిశీలించారు. ఎఎంసి చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, గొలపల శ్రీనివాసరావు, ముక్కా మల సాంబశివరావు, పల్లం సరోజిని, ఆంద్రెయ పాల్గొన్నారు.



జలజీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న నరేంద్ర వర్మ



అర్ధనగ్న ప్రదర్శనలో మున్సిపల్ కార్మికులు

ఇంజినీరింగ్ కార్మికుల అర్ధనగ్న నిరసన

ప్రజాశక్తి - అద్దంకి

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 13 నుండి నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక బంగ్లా రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన, నిరసన శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. కార్మికులకు గత 40ఏళ్ల నుండి రిటైర్మెంట్ వచ్చే వరకు పనిచేసిన రూ.13వేల నుండి రూ.15వేల వేతనమే తీసుకుంటున్నారని అన్నారు. కనీసం భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న రోజువారి కార్మికులకు ఇచ్చిన వేతనం కూడా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు ఇవ్వటం లేదని అన్నారు. స్కిల్ వర్కర్లుగా పని చేస్తున్నారని, స్కిల్ వర్కర్‌కు ఇవ్వాల్సిన కనీస వేతన చట్టాన్ని అమలు చేయడం లేదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న కోర్టు తీర్పును అమలు చేయాలని కోరారు. గత ఏడాది 17రోజుల సమ్మె కాలపు ప్రభుత్వ ఒప్పందాలను అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇంజనీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. ప్రభుత్వ పరంగా అమలయ్యే 'తల్లికి వందనం', ఇతర రకాల సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. ఉద్యోగులనే పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదని అన్నారు. పట్టణ ప్రజలు కార్మికుల పోరాటాన్ని బలపర్చాలని కోరారు. ఈనెల 13 నుండి జరగబోయే నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అత్యవసర సేవలను కూడా బంద్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పి ఆదాం, సిఐటియు నాయకులు తోట వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు పి జాన్, ఉసురుపాటి సామ్యూల్, కోశాధికారి మారుతి, జాషువా, మార్కు పాల్గొన్నారు.



డ్రోన్ కెమెరాను ఎస్పీకి అందజేస్తున్న దృశ్యం

'శ్రీ ప్రతిభ' ఆధ్వర్యంలో

డ్రోన్ కెమెరా అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా పోలీసు విభాగం కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన విలువైన డ్రోన్ కెమెరాను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్‌కి శ్రీ ప్రతిభ విద్యా సంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ తాలూకా సీఐ విజయకృష్ణ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ, ఇదొక స్ఫూర్తిదాయక కార్యక్రమమని, విద్యా సంస్థల భాగస్వామ్యం ప్రజాసేవలో ఎంతో ప్రాధాన్యం కలిగి ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వహణ సంస్థకు పోలీసులు కతజ్ఞతలు తెలియజేశారు. సమాజానికి ఉపయోగపడే ఈ సేవా కార్యక్రమం ఇతర సంస్థలకు కూడా ప్రేరణ కలిగించాలని ఆశించారు.



మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

గాంధీ పార్కులో కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగరంలోని గాంధీపార్కులో నగరపాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. అక్కడి వాకర్స్‌తో, మహిళలతో మాట్లాడారు. మహిళల సూచనలు తీసుకున్నారు. డ్రింకింగ్ వాటర్ ఏర్పాటు చేయాలని, కూర్చోవటానికి సిమెంట్ బల్లలు ఏర్పాటు చేయాలని మహిళలు కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పార్కులో ఇంకా మెరుగైన వసతులు ఏర్పాటుచేస్తున్నామని, పార్కును చాలా అందంగా పచ్చదనంతో తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

భూసేకరణ క్లెయిమ్స్

త్వరితగతిన పూర్తి చేయండి

అధికారులకు ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ క్లెయిమ్స్ త్వరితగతిన పూర్తి చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఒంగోలు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎన్ హెచ్- 565, ఎన్ హెచ్- 216, ఎన్ హెచ్- 544 డి, ఎన్ హెచ్- 167బి, ఎన్ హెచ్- 765, ఎన్ హెచ్- 544 జి, మరియు నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ వంటి ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ పురోగతిపై సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, ప్రాజెక్టుల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత ప్రాజెక్టు లకు సంబంధించి భూ సేకరణ పై అధికారులు ప్రత్యేక దష్టి సారించి ల్యాండ్ క్లెయిమ్స్, స్ట్రచర్ క్లెయిమ్స్ క్లియర్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూ సేకరణ కు సంబంధించి పెండింగ్ లో ఉన్న అవార్డులు పాస్ చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రెవెన్యూ సంబంధిత ప్రాజెక్టుల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యం మేరకు భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ ల్యాండ్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో

వసతుల కల్పనకు ప్రాధాన్యత

ఉపాధ్యాయుడుగా మారిన ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

విద్యారంగంలో అనేక సంస్కరణలు చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చుచేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఆర్.గోపాలక్రిష్ణ పేర్కొన్నారు. శుక్రవారం నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలు గ్రామంలో సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గహాన్ని, ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల విద్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ప్రభుత్వ బాలుర వసతి గహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి.. విద్యార్థులకు అందిస్తున్న వసతులను పరిశీలించారు. హాజరు రిజిస్టర్‌ను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి స్టాక్ రిజిస్టర్ ప్రకారం సరుకులు ఉన్నాయా, లేదా..? అని క్షుణ్ణంగా పరిశీలన చేశారు. స్టాక్ రిజిస్టర్‌కు, స్టోర్ రూమ్‌లో సరుకుల నిల్వలకు వ్యత్యాసం ఉండటం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు



టీచర్‌గా మారి.. విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలకృష్ణ

స్టాక్ రిజిస్టర్‌ను అప్‌డేట్ చేయాలని వార్డెన్ లింగయ్యను ఆదేశించారు. సోమవారం నాటికి వసతిగహం కిటికీలకు దోమతెర మెష్ ఏర్పాటు చేయడంతో పాటు టాయిలెట్స్ మరమ్మతులు చేపట్టాలని సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ గోపాలక్రిష్ణ అమ్మనబ్రోలులోని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి.. వారి సామర్థ్యాన్ని స్వయం గా పరిశీలించారు. ఇంగ్లీష్, తెలుగు తదితర సబ్జెక్టులకు సంబంధించి.. పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి, రుచి చూశారు. అనంతరం నిడమానూరు హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మి నాయక్, జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి నిర్మలజ్యోతి, తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితుల ఆందోళన

లక్షిత్‌ను హత్య చేసిన వారిని అరెస్టు చేయాలని నిరసన

ప్రజాశక్తి-కంభం రూరల్

మూడు రోజుల కిందట మండలంలోని లింగోజిపల్లెకు చెందిన లక్షిత్ అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లి వస్తూ అదశ్యం కావడం, గురువారం అతని మతదేహం సూరేపల్లి గ్రామం సమీపంలోని పొలాలలో కనపడిన విషయం తెలిసిందే.. లక్షిత్‌ను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లక్షిత్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శుక్రవారం ఉదయం కంభం పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించి.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లక్షిత్‌ది సహజ మరణం కాదని హత్యేనని, హత్యకు కారకులైన



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ మల్లికార్జునరావు

వారిని పోలీసులు ఇంతవరకు పట్టుకోలేకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ఎవరిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. అక్కడికి వచ్చిన కంభం సిఐ కె.మల్లికార్జునరావు మాట్లాడుతూ పోస్టుమార్టం రిపోర్టులో అన్ని విషయాలూ తెలుస్తాయని, తాము అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. ఒక వేళ నిజంగా హత్య అయితే నిందితులను తాము తప్పకుండా పట్టుకొని శిక్షిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

రైతుకు వెన్నుదన్నుగా నిలబడాలి..

డిఆర్‌డిఏ పీడీ టి.నారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వ్యవసాయం మరియు అనుబంధ రంగాల జీవనోపాధులను పెంపొందించడంలో రైతుకు వెన్నుదన్నుగా రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఒలు) అండగా నిలబడాలని డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నాడు టిటిడిసి శిక్షణ కేంద్రంలో రైతు ఉత్పత్తి దారుల సంస్థ (ఎఫ్‌పిఒలు) సమీక్షా సమావేశంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ జోసెఫ్ కుమార్, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు పండించిన పంటల ప్రాసెసింగ్ యూనిట్లు మొదలు, పలు వాణిజ్య పంటలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహల గురించి అవగాహన కల్పించాలన్నారు. మునగ సాగు, వెదురు, తేనెటీగల పెంపకం, షేడ్ నెట్స్ కల్టివేషన్, కొర్రమేను పెంపకం, సోలార్ విద్యుత్ వల్ల రైతులు పొందే ప్రయోజనాలపై చిన్న సన్నకారు రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న డిఆర్‌డిఏ పీడీ టి.నారాయణ

చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీతో పలు పథకాలు అమలు చేస్తున్నట్లు, అర్హులైన ప్రతి రైతూ పొందే లాగా సిబ్బంది ప్రోత్సాహించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారి డి.సంధ్యారాణి, ఎపిసిఎన్ఎఫ్ జెపిఇ డి.ఝాన్సీ రాణి, అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డి.దానం, జీవనోపాధుల విభాగం డైరెక్టర్ లక్ష్మీరెడ్డి, డిపిఎం జె.నారాయణ, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్, ఏపిఎంలు, ఎఫ్‌పిఒలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్స్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి నేతలు

అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు..

మంత్రి స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

ఆత్మీయ సమావేశాల పేరుతో వైసీపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. శుక్రవారం నాడు కొండపిలో వైసీపీ నేతల ఆత్మీయ సమావేశంలో ఆ పార్టీ నేతలు మాట్లాడిన వ్యాఖ్యలకు మంత్రి స్వామి ఒక ప్రకటనలో కౌంటర్ ఇచ్చారు. ప్రజలు బుద్ధిచెప్పినా సరే వారి తీరు ఏ మాత్రం మార లేదన్నారు. అవే అబద్ధాలు చెబుతున్నారని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరగని అభివృద్ధి, సంక్షేమం తాము ఏడాదిలోనే చేశామని చెప్పారు. జగన్‌లా మోసం చేయకుండా రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నామన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న దామచర్ల సత్య

కూటమి పాలనలో ఏడాదిలోనే అభివృద్ధి

రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్రంలో గత ఐదేళ్లలో జరగని అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిందని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. జరుగుమల్లి మండలంలోని దావగూడూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడపగడపకూ తిరుగుతూ ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి జరుగుమల్లి అధ్యక్షులు పోకూరి రవీంద్రబాబు, కామేపల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, దావగూడూరు మాజీ సర్పంచి చదలవాడ బ్రహ్మేంద్రం, దామచర్ల శ్రీనివాసరావు, బత్తిన బ్రహ్మయ్య, టిడిపి సీనియర్ నాయకులు మక్కెన వెంకటరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలోని జెడ్‌పి కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, శివప్రసాద్ కాలనీ, కొత్తడొంక తదితర ప్రాంతాలలో శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి పాండురంగారావు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

- డి1 పరిధిలోని పలు చోట్ల శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించటం తదితర కారణాల వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి పాండురంగారావు తెలిపారు. కోర్ట్ సెంటర్, సెంట్రల్ కేఫ్, శ్రీగిరి కొండ మీద, రాజాపానగాల రోడ్డు, జమ్మి చెట్టు బజారు, సాయిబాబా టెంపుల్ ఎదురు, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, గద్దలగుంట, రాజీవ్ నగర్, విఐపి రోడ్ , అడపా బేర్ని, అల్లూరయ్య స్వీట్స్ , మంగమూరు రోడ్డు, 220 కేవీ సబ్ స్టేషన్ ఎదురు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న దృశ్యం

వికలాంగులకు ఉపకరణాలు అందజేత

ప్రజాశక్తి - పంగులూరు

దివ్యాంగులైన విద్యార్థులు ఉపకరణాలను ఉపయోగించుకొని భవిష్యత్తులో మంచి స్థానాన్ని పొందాలని ఎంఇఒ జి వీరాంజనేయులు అన్నారు. దివ్యాంగ విద్యార్థులు వీటి ద్వారా సులభంగా తమ పనులు చేసుకుంటూ చదువుకునే అవకాశం ఉందని అన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ డి భాస్కర మూర్తి మాట్లాడుతూ సర్వ శిక్ష అభియాన్, ఎఎల్ఐఎంసిఒ కమిటీ చేసిన పరిరకాల ఉపకరణాల్లో వీల్ చైర్స్, బ్యాటరీ చైర్స్ లాంటివి ఉన్నాయని, ఈ ఉపకరణాలు ఉపయోగించు కోవాలని, అవి ఉపయోగించుకునే విధానాన్ని ఐఆర్టీలు స్పెషల్ ఎడ్యుకేటర్స్ నేర్పిస్తారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెచ్ఎం లలిత కుమారి, జెడ్పి ఉన్నత పాఠశాల హెచ్ఎం సోమేపల్లి శ్రీనివాసరావు, కంకణాల శ్రీనివాసరావు, గుర్రం లక్ష్మీప్రసాద్, యోహాను, అరుణ, గ్రామస్తులు, వివిధ గ్రామాల నుండి వచ్చిన దివ్యాంగులు, తల్లి, దండ్రులు పాల్గొన్నారు.

15 నుంచి ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి - అద్దంకి




ఎంపిడిఒ బి సింగయ్య

మండలంలో ఈ నెల 15 నుండి 18 వరకు, తిరిగి 22 నుండి 25 వరకు ఆధార్ క్యాంపు నిర్వహించ నున్నట్లు ఎంపిడిఒ బి సింగయ్య తెలిపారు. 15న మోదేపల్లి, ఝార్ల పాలెం, విప్పర్లవారిపాలెం, 16న పేరాయపాలెం, వేల మూరిపాడు, వెంకటాపురం, 17న కొంగపాడు, కలవ కూరు, ధర్మవరం, 18న మణికేశ్వరం, చక్రాయపాలెం, శంక వరప్పాడు, 22న బొమ్మనంపాడు, సింగరకొండపాలెం, కొటికలపూడి, 23న మైలవరం, గోపాలపురం, కుంకుపా డు, 24న ఉప్పలపాడు, నాగులపాడు, తిమ్మాయపాలెం, 25న వెంపరాల, గోవాడ, రామాయపాలెం గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఆధార్ కార్డులు నమోదు చేసుకునే వారు, సవరణలు, ఇతర సమస్యలను ఈ క్యాంపుల్లో సవరించుకోవచ్చని అన్నా రు. ఆయా సచివాలయాల్లో ఆధార్ క్యాంపులలో ప్రజలు ఆధార్ సవరణలు చేసుకోవాలని సూచించారు. కొద్దిపాటి నిర్దేశించిన ఫీజులు మాత్రమే వసూలు చేస్తారని తెలిపారు.

13న బుర్రకథ ప్రదర్శన

ప్రజాశక్తి - యద్దనపూడి



బుర్రకథ కథకుడు బాబూజీ

మండలంలోని అనంతవరంలో జూలై 13 ఆదివారం సాయంత్రం బుర్రకథ పితామహుడు షేక్ నాజర్ కుమారుడు, కళా రత్న షేక్ బాబూజీ బృందంచే బుర్రకథ ఏర్పాటు చేసినట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా బహుజన నాయకులు మైలా చిన నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పంతగాని రమేష్, తహశీల్దారు రవికుమార్, ఎస్ఐ రత్నకుమారి, పొన్నూరు స్నేహ సొసైటీ మేనేజర్ కొప్పుల వంశీ హాజరవుతారని తెలిపారు. గతంలో నాజర్ బుర్రకథ ద్వారా సమాజాన్ని చైతన్యం చేశారని తెలిపారు. ప్రస్తుత వేగవంతమైన, ఉరుకులు పరుగుల జీవనంతో ఉన్న ప్రజలకు మానసిక ఉల్లాసం కోసం బుర్రకథ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పనుల ఒత్తిడిలో ఉన్న ప్రజలకు కొంత మానసిక ఉల్లాసం కలిగించడం కోసం ఇలాంటి సామాజిక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రైవేటు బ్యాంకు మేనేజర్ కప్పుల వంశీ తెలిపారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర, పలనాటి వీరగాథ, బాలచంద్రుని చరిత్ర ప్రేక్షకులకు కోరిక మేరకు షేక్ బాబూజీ చెబుతారని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్ ఆశీర్వాదం, విజయ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

ప్రజలతో నేరుగా మమేకమై, ప్రజల సమస్యలు స్వయంగా అడిగి తెలుసుకొని ఆయా శాఖల అధికారులతో చర్చించి పరిష్కారం చేయడం కోసమే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు శాసన సభ్యులు కొండయ్య అన్నారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని అన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ప్రజల దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రతి ఒక్కరి సమస్య వినడమే కాక సంబంధిత అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లి వేగవంతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అన్ని గ్రామాల అభివృద్ధే తన లక్ష్యమని అన్నారు. ప్రజాదర్బార్లో 165 ఫిర్యాదులు అందగా వాటిలో 40 పెన్షన్, 120 ఇళ్ల స్థలా, ఐదుగురు ఇతర సమస్యలపై వినతులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్, ఎఎంసి చైర్మన్ జనార్దన్, టిడిపి మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, తెలుగుదేశం, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల : ప్రజా దర్బార్లో ప్రజలు అందించే ప్రతి సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం చేస్తామని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్లో ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి పిర్యాదులు, వినతులు స్వీకరించే ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారుల ద్వారా త్వరితగతిన పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని అన్నారు. సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు తమ సమస్యలు పరిష్కారం కోసం అధికారుల వద్దకు కాళ్ళ రిగేలా తిరగవద్దని అన్నారు. సహేతుకమైన ఎంతటి సమస్యనైనా అర్జీ రూపంలో తమ దృష్టికి తేవాలని అన్నారు. పరిష్కారంలో జాప్యం లేకుండా వెంటనే పరిష్కార మార్గం చూపుతామని అన్నారు.



వినతులు పరిశీలిస్తున్న నరేంద్ర వర్మ

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పర్చూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపిపి మేక ఆనంద కుమారి తెలిపారు. స్థానిక ఎంఆర్సి సమావేశం హాలులో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. అభివృద్ధికి తోడ్పడాలని చెప్పారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఎఒ భాస్కరరావు మాట్లాడుతూ పొగాకు కొనుగోలు కేంద్ర ద్వారా రైతుల వద్ద ఉన్న చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తారని చెప్పారు. త్వరలోనే ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నగదును రైతుల ఖాతాలో జమ చేస్తుందని చెప్పారు. ఆర్డబ్ల్యుఎస్ ఎఇ కిషోర్ మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువుల్లో నీరు బాగోలేదని అనిపిస్తే వెంటనే ఆ నీటిని పరీక్షలకు పంపించాలని చెప్పారు. కెడబ్ల్యుడి కెనాల్ నుంచి వచ్చే నీటిని చెరుకూరు, రమణయపాలెం, కొత్తపాలెం, పోతుకట్ల, వీరన్నపాలెం గ్రామాల చెరువులు నింపుకోవాలని సూచించారు. ప్రమాదం జరగకముందే వాటిని సరి చేయాలని విద్యుత్ ఎఇ రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. విరిగిపోయిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్ఆర్ఈజిఎస్ పథకం ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించుకోవచ్చని ఎపిఒ రమేష్ చెప్పారు. ఎంఈఓ2 వెంకట్రామయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి పిల్లవానికి కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమందికి తల్లికి వందనం డబ్బులు తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని చెప్పారు. ఎంపిడిఒ ప్రద్యుమ్న కుమార్, వెలుగు ఎపిఎం రామకృష్ణ, హౌసింగ్ ఎఇ రమేష్ మాట్లాడారు. ఎంపిటిసిలు తమకు గత 21 నెలల నుండి గౌరవ వేతనం ఇవ్వడం లేదని ఎంపిడిఒ దృష్టికి తీసుకువచ్చారు. గత వైసిపి ప్రభుత్వంలో 9 నెలలు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో 12 నెలలు తమకు గౌరవ వేతనం అందాల్సి ఉందని చెప్పారు. సమస్య పరిష్కరిస్తానని ఎంపిడిఒ పేర్కొన్నారు.



సమావేశంలో సమీక్షిస్తున్న ఎంపిపి, ఎంపిడిఒ

13న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - నగరం

స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కళాశాల నందు ఆస్టర్ రమేష్ హాస్పటల్ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వైద్యులు మాట్లాడుతూ ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ 37వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థాగత సామాజిక బాధ్యతగా ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ నెల 13న ఆదివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు కళాశాల ప్రాంగణంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు ఎన్విఎ ప్రసాద్, జనసేన ఇన్చార్జ్ మత్తి భాస్కరరావు, ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, డిస్ట్రిబ్యూటర్ కమిటీ మెంబర్ షేక్ మున్నాఫ్ పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక వైఆర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 13న ఆదివారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్, గుంటూరు శంకర కంటి ఆసుపత్రి, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది శుక్రవారం తెలిపారు. కంటి వైద్య శిబిరానికి వచ్చేవారు ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు జిరాక్స్ కాపీలు తమ వెంట తీసుకురావాలని కోరారు. కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్ తీసుకురావాలని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న రమేష్ హాస్పిటల్ డాక్టర్ వై కార్తిక్ చౌదరి



ఆర్థిక సహాయం అందిస్తున్నడీఎస్పీ మోయిన్

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేటపాలెం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 2009 బ్యాచ్కు చెందిన కానిస్టేబుల్ బిల్లా రమేష్ ఇటీవల అకాల మరణం చెందారు. ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని నిశ్చయించుకున్న తోటి పోలీసు సిబ్బంది రూ.1,58,500 నగదు సమకూర్చారు. ఆ మొత్తాన్ని ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు డీఎస్పీ మోయిన్ స్వయంగా వేటపాలెంలోని బిల్లా రమేష్ ఇంటికి వెళ్లి వృద్ధాప్యంలో ఉన్న రమేష్ అమ్మమ్మను పరామర్శించి నగదును అందజేశారు. రమేష్ చిన్నతనంలోనే తల్లిని కోల్పోయాడు. ఈ క్లిష్ట సమయంలో ఆయన అమ్మమ్మ దాసరి సుబ్బులు రమేష్ ఆలన, పాలన చూశారు. రమేష్ అకాల మరణంతో కుటుంబం తీవ్ర శోకంలో మునిగిపోయింది. కార్యక్రమంలో 2009 బ్యాచ్కు చెందిన కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



స్వర్లలో మానవహారం నిర్వహించిన వైద్య సిబ్బంది

బాల్య వివాహాలు నివారించాలి

ప్రజాశక్తి - కారంచేడు

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని స్వర్ణ ప్రాథమిక వైద్యశాల సిబ్బంది పంచాయితీ కార్యాలయం సెంటర్లో శుక్రవారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం శాలిని మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పాటించాలని, ఆడపిల్లలకు 21ఏళ్ళు, మగవారికి 25ఏళ్లుగా వివాహ వయస్సు ఉండాలని చెప్పారు. కుటుంబ సంక్షేమమే సమాజ సంక్షేమమని అన్నారు. బాల్య వివాహాలు నివారించాలని, ప్రణాళికా బద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ హస్నప్రియ, వైద్య సిబ్బంది మాధురి, సిఫోరా, ఎల్వీ శంకర్, ఎఎన్ఎంలు నాగలక్ష్మి, సౌజన్య, సర్పంచ్ ఎం మధుసూదనరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ స్వాతి కిరణ్

వేటపాలెం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని వేటపాలెం-2 సచివాలయంలో డాక్టర్ స్వాతి కిరణ్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం గర్భిణీ స్త్రీలకు అందించే సేవలు వివరించారు. చీరాల పిపి యూనిట్ వైద్యాధికారి డాక్టర్ యాకబ్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రతి గర్భిణీ స్త్రీ వినియోగించుకోవాలని తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులైన కండోమ్, గర్భనిరోధక మాత్రలు తదితర పద్ధతుల ద్వారా ఆరోగ్యకరమైన సంతానాన్ని కలిగి కుటుంబ సంక్షేమం ద్వారా సమాజ సంక్షేమంకు పాటుపడాలని తెలిపారు. సూపర్వైజర్ సుధాకర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9, 10 తేదీల్లో నిర్వహించే ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమానికి వచ్చి ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను చీరాల సబ్ యూనిట్ అధికారి శేషుబాబు అవగాహన కల్పించారు. వైద్యాధికారిణి డాక్టర్ సాయి వైష్ణవి, సూపర్వైజర్ మార్థమ్మ, శిరోరాణి, ఎఎన్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
7
శనివారం 12 జులై 2025

సంక్షేమం అందిస్తూ... సమస్యలు వింటున్నాం

రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రజాశక్తి - రేపల్లె

తమ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన ఏడాది కాలంలో రాష్ట్రంలో ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించేందుకు 'సుపరిపాలనకు తొలి అడుగు' ఇంటింటికి టిడిపి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని 3వ వార్డులో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇచ్చి ప్రజలతో మాట్లాడారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనా ఒక చీకటి యుగమని ఆరోపించారు. అవినీతి, అక్రమాలు, అన్యాయలు, దోపిడి దౌర్జన్యాలతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన అనేక ఘటనలను గుర్తు చేశారు. ఐదేళ్ల పాలనలో ఏనాడు పరదాలు లేకుండా ప్రజల వద్దకు వెళ్లలేదని విమర్శించారు. కుట్రలు, కుతంత్రాలతో, వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ప్రజా రాజధాని అమరావతిని విధ్వంసం చేశారని అన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం పునర్నిర్మిస్తోందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 20లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజా రాజధాని అమరావతి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తున్నామని ప్రకటించారు. ఆగస్టు నెల నుండి మహిళలకు జిల్లా స్థాయిలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నెరవేరుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, మంత్రి సోదరులు శివప్రసాద్, టిడిపి అధ్యక్షులు మేక రామకృష్ణ, వేమూరి అజయ్ బాబు పాల్గొన్నారు.

యద్దనపూడి : ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి తమ ప్రభుత్వ లక్ష్యమని శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని అనంతరంలో సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి టిడిపి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని భోగ మల్లేశ్వర స్వామి ఆలయంలో పూజ సందర్భంగా ఆలయ అర్చకులు, గ్రామస్తులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సిఎం చంద్రబాబు సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు అందిస్తున్నారని అన్నారు. ఎస్సీ కాలనీలో నూతనంగా రూ.30 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లును ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షులు ఎన్ రంగయ్య చౌదరి, కనపర్తి నాగేశ్వ రరావు, గుదే తారక రామారావు, రాయపాటి సీతయ్య, కొరటాల వంశీకృష్ణ, కోయ సతీష్, వజ్జా సుబ్బరామయ్య, కర్లపూడి నారాయణస్వామి, దొడ్డ అప్పారావు, వీరపనేని వాసు, ఈదల అనిల్ కుమార్, సూరిశెట్టి శ్రీనివాసరావు, షేక్ బాజీ, సతీష్, గండు వీరశం కరావు, నిమ్మల సాంబశివరావు, పోపూరి హనుమంతరావు, పోపూరి సాంబశివరావు, నర్రా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వేమూరు : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు శాసన సభ్యులు నక్క ఆనందబాబు పేర్కొన్నారు. చుండూరు మండలం దుండిపాలెంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన గ్రామస్థులను స్వయంగా కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి ఇంటికి వెళ్లి ఏడాది కాలంలో గ్రామంలో చేసిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమం వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నోట్ చేసుకున్నారు. ఆ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తమ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వేమూరు ఎఎంసి చైర్మన్ గొట్టిపాటి పూర్ణ కుమారి పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు



ప్రజా సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ఆనందబాబు



విద్యార్థులను అభినందిస్తున్న కమిషనర్ సాంబశివరావు

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - రేపల్లె

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన జీవితం, నాయకత్వ కలక్షణాలు అలవర్చుకోవాలని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని మోంట్‌ఫోర్స్ పాఠశాల క్యాబినెట్ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆయన మాట్లాడారు. విద్య, క్రీడా, సాంస్కృతిక, సేవా రంగాల్లో నూతనంగా ఎన్నికైన పాఠశాల క్యాబినెట్ విద్యార్థులచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన మార్చి ఫాస్ట్, క్రీడా విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న తేళ్ళ రాంబాబు

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన పిజి కేంద్రం డైరెక్టర్, సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగ ప్రముఖ శాస్త్రవేత్త ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను డాక్టర్ బాబు జగజ్జీవన్‌రావు చైర్ పరిశోధకులు తేళ్ల రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈపురుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువ వంతెన వద్ద కట్టమీద నివాసం ఉంటున్న విద్యార్థులకు పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిన గొప్ప గురువని తెలిపారు. దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌గా నాగార్జున విశ్వవిద్యాలయానికి రాష్ట్ర వ్యాప్తంగా మంచి పేరు తీసుకొచ్చిన ఘనత ఆయనదేనని అన్నారు.

మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చీరాల

రైళ్లలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ మోయిన్ హెచ్చరించారు. స్థానిక రైల్వే స్టేషన్‌తో పాటు వివిధ రన్నింగ్ రైళ్లలో పోలీసుల శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు డిఎస్పీ మోయిన్ స్వయంగా పర్యవేక్షణ చేశారు. గత కొన్ని రోజులుగా రైళ్ల ద్వారా గంజా రవాణా జరుగుతుండటంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేశారు. సిఐలు, ఎస్ఐలు, రైల్వే పోలీసులు కలసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగులు సోదా చేశారు. మాదక ద్రవ్యాల రవాణా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనే వారిని ఉపేక్షించేది లేదని అన్నారు. సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. తల్లి, దండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టి, వారు చెడు మార్గాలకు వెళ్లకుండా పర్యవేక్షించాలని సూచించారు. డ్రగ్స్ నివారణలో పోలీసులు మాత్రమే కాదు, ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఏవైనా అనుమానాస్పద చర్యలు, వ్యక్తులపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. తనిఖీల్లో రైల్వే సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కొండయ్య, వన్ టౌన్, టూ టౌన్ సిఐలు సుబ్బారావు, నాగభూషణం, ఎస్ఐలు రాజ్యలక్ష్మి, హరిబాబు, పవన్ కుమార్, నాగ శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రైల్లో ప్రయాణికులను విచారిస్తున్న డిఎస్పి మోయిన్



క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైసిపి నేతలు

క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యద్దనపూడి

ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలు గుర్తు చేస్తూ క్యూఆర్ కోడ్‌ను వైసిపి నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. మండలంలోని తనుబొద్దివారి పాలెంలో జరిగిన వైసిపి సభకు రావూరి వేణుబాబు అధ్యక్షత వహించారు. అంబేద్కర్, వైఎస్ఆర్, మాజీ సర్పంచ్ చల్లా సుబ్బారెడ్డి విగ్రహాలకు నివాళులు అర్పించారు. సభలో వైసిపి ఇన్‌ఛార్జి గాదె మధుసూదనరెడ్డి నాయకులు రావూరి వేణు బాబు, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, సర్పంచ్ వెంకాయమ్మ, ఉవ్వా రాంబాబు, సుభాష్, వందనం, అఖిల్, దాసరి వెంకటరావు, అమ్మిరెడ్డి, పూనూరి సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ టవర్ లైన్ పనులు కారణంగా సంజీవ నగర్, విఎన్ఎస్ సినిమా హాల్ చుట్టూ ప్రక్కల ప్రాంతాలు, ఆర్టీసీ బస్టాండ్, రామా టాకీస్ రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్, ఎస్‌బిఐ పరిసర ప్రాంతాలు, పొట్టి శ్రీరాములు బొమ్మ రోడ్, అత్తులూరి బజార్, పుట్టపర్తి సాయిబాబా బజార్, బంగాళా రోడ్డు, కళామందిర్ సినిమా హాల్ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుండి ఒంటిగంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని డిఇఇఎం దామోదరం తెలిపారు.

కొల్లూరు : ఈనెల 12న 2వ శనివారం కొల్లూరు 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ కారణంగా గాజులంక ఫీడర్ పరిధిలోని ఆవులవారి పాలెం, పెసర్లంక, గాజులంక, ఈపూరు లంక సబ్ స్టేషన్ ఈపూరు ఫీడర్ పరిధిలోని ఈపూర్ లంక, చింతల్ లంక, పెదలంక, కాపులవారిపాలెం గ్రామాలకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఎఇ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని మక్కెనవారిపాలెంకు చెందిన ఊదరగుడి సురేష్ (42) నాలుగు రోజులుగా కనిపించడం లేదని అతని భార్య నాగమణి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు. బాపట్ల సమీపంలోని నరసాయపాలెంలో సురేష్ బంధువు చనిపోవడంతో అంత్య క్రియల్లో పాల్గొనేందుకు ఈనెల 8న ఇంటి నుండి బయలు దేరి వెళ్లాడని, అదే రోజు సాయంత్రం 8 గంటలకు మార్టూరు వచ్చి ఇంటికి వస్తున్నానని తనకు ఫోన్ చేసి చెప్పాడని పిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. అప్పటి నుండి నాలుగు రోజులైనా తిరిగి రాలేదని తెలిపారు. ఫోను స్విచ్ ఆఫ్ చేసి ఉందని, తమ సమీపంలోని బంధువుల వద్ద విచారించాచినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదని తెలిపారు. 5.5 అడుగుల ఎత్తు, ఎరుపు రంగు కలిగి, మెరూన్ రంగు నిండు చేతుల చొక్కా, తెలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. అతని గురించి ఏదైనా సమాచారం తెలిస్తే 9121102168 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వేణుగోపాలరావు

విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పాఠశాల దశ నుండే చిన్నారులు ఆరోగ్యం పట్ల అవగాహనా కలిగి ఉండాలని వెల్నెస్ కోచ్ వై వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని అద్దేపల్లి హెచ్‌ఈ పాఠశాల విద్యార్థులకు ఆహారపు అలవాట్లు అనే అంశంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రతీ రోజు ఉదయం నుంచి రాత్రి వరకు చేయాల్సిన పనులు, అలవాట్లు, తీసుకోవాల్సిన ఆహారం తదితర విషయాలు వివరించారు. మన అలవాట్లే మన ఆరోగ్యం, పౌష్టికాహారం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యాయురాలు నీలా సుధారాణి పాల్గొన్నారు.

దేవాలయ భూములకు వేలం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరు శ్రీ త్రివిక్రమ అగస్తేశ్వర స్వామి దేవాలయ భూములకు ఈఒ దామా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం వేలం నిర్వహించారు. 36.59ఎకరాల భూమికి బహిరంగ వేలం జరిపారు. 9 మంది రైతులు వేలంలో పాల్గొన్నారు. రూ.7.76 లక్షలకు వేలం పాడుకున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ.68 వేలు అదనంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామంలో పిచ్చికుక్క దాడి చేసి శుక్రవారం ఆరుగురిని గాయపరిచింది. దీంతో గ్రామంలో వీధుల వెంట నడిచే పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో కూడా కుక్కలు వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలు జరిగాయి. గ్రామంలో ఏ బజారులో చూసిన కుక్కలు దాడి చేస్తున్నాయి. 12వేల జనాభా గ్రామంలో నివసిస్తున్నారు. కుక్క కాటు, పాము కాటుకు గురైన వారికి సచివాలయ క్లినిక్ లలో అందుబాటులో మందులు లేవని చెబుతున్నారు. బాధితులు నరసరావుపేట కార్పోరేట్ ఆసుపత్రుల్లో కొందరు చికిత్స పొందుతున్నారు. కుక్క కాటు, పాము కాటుకు గురైన వారు కొందరు అంత్రాలు, తాయత్తులు కట్టించుకుని ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. గతంలో సజ్జాపురం ఎస్సీ కాలనీలో పాము కరిచిన మహిళకు ఆసుపత్రికి పోకుండా అంత్రాలు కట్టారు. దీంతో విషం సోకి ఆ మహిళ మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. గ్రామంలో తిరగాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పాడింది. స్థానిక పంచాయతీ అధికారులు కుక్కలను పట్టుకుని సుదూర ప్రాంతాలకు తరలించాలని, విష జంతువుల దాడికి గురైన వారికి సచివాలయ క్లినిక్‌లో మందులు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలు రవాణా చేస్తే కఠిన చర్యలు

ఒంగోలు రైల్వే స్టేషన్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా చేసినా, సేవించినా విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. గంజాయి, మాదక ద్రవ్యాలు నిర్మూలన లక్ష్యంగా జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఈగిల్ టీం, ఆర్‌పిఎఫ్, జీఆర్‌పీ అధికారులు మాదకద్రవ్యాలను గుర్తించే పోలీస్ డాగ్ స్క్వాడ్‌తో కలిసి ఒంగోలు రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని బోగీలు, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, పార్శిల్ సెంటర్లు, అనుమానాస్పదంగా కనిపించిన ప్రతి పార్సిల్‌ను అణువణువునా ముమ్మరంగా పరిశీలించారు. ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించి బోగీలను విస్తత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నారు. నిషేధిత గంజాయి, మాదకద్రవ్యాలను రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా, మాదకద్రవ్యాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే



రైల్వే స్టేషన్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

లక్ష్యంగా గంజాయి, మత్త పదార్దాల నిర్మూలనకు, అక్రమరవాణాను అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని, ప్రతి కళాశాల, పాఠశాలలో యువతలో అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి, మాదక ద్రవ్యాలపై సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972, స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 కు, పోలీసు వాట్సాప్ నెంబరు 9121102266కు తెలియజేయాలన్నారు. తనిఖీలో మహిళా పియస్ ఇన్‌స్పెక్టర్ సుధా కర్, ఒంగోలు టు టౌన్ సిఐ ఎం.శ్రీనివాసరావు, జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ షరీఫ్, ఆర్‌పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, ఈగల్ టీం, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రతి సబ్ స్టేషన్ పరిధిలో

సోలార్ ప్లాంట్ ఏర్పాటు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-కనిగిరి

ప్రతి సబ్‌స్టేషన్ పరిధిలో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి విద్యుత్తు కొరత లేకుండా, నష్టాలు లేకుండా చూసేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కావడం జరిగిందన్నారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తూరులో శుక్రవారం సాయంత్రం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తో కలిసి పాల్గొ న్నారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని యాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ 75 వేలకు పైగా వ్యవసాయ కనెక్షన్లను ఇవ్వడం జరిగిందని, ఇంకా కావాలని రైతులు దరఖాస్తులు చేసుకుంటున్నారని వారికి కూడా ఇస్తామని తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ప్రయోజనం జరుగుతుందని దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. పాత మీటర్లు తొలగించకుండా స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ద్వారా ఇందులో మోసం లేదని నిరూపించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించవచ్చని ఆ దిశగా చర్యలు చేపట్టాలని



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర, మంత్రి గొట్టిపాటి

విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కనిగిరి పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు చింతలపూడి తిరుపాలు నాయి బ్రాహ్మణులకు సెలూన్ షాపులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు అమలు చేయాలని మంత్రిని కోరగా తప్పకుండా అమలు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఉపాధి హామీ పథకం లో గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్లో ఉన్నాయని టిడిపి నాయకులు ముచ్చుమారి చెంచిరెడ్డి మంత్రి గొట్టిపాటి దష్టికి తీసుకురాగా బిల్లుల చెల్లింపుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు. కనిగిరిలో పారిశుద్ధ్య సమస్య పై ప్రత్యేక దష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, యూత్ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, టిడిపి నాయకులు యారవ శ్రీనివాసులు, వివిఆర్ మనోహర్రావు, బాలు ఓబుల్ రెడ్డి, బుల్లా బాలబాబు, పి రామకష్ణ, మురళి, పుట్లూరి కష్ణ, తమ్మినేని సురేంద్ర రెడ్డి, అచ్చాల రవి, ఉండేలా శ్రీనివాసరెడ్డి, పిల్లి కిరణ్ కుమార్ రెడ్డి, పిచ్చల శ్రీనివాసరెడ్డి, సి హెచ్. నాగార్జునయాదవ్, కే.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆధునికత వైపు మొగ్గు చూపాలి

రైతులు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను స్వీకరించి వ్యవసాయ వ్యయాలను తగ్గించుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కనిగిరి శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచించారు. శుక్రవారం కనిగిరి పట్టణంలోని కొత్తూరులో రైతు గ్రూపులకు ప్రభుత్వం రాయితీపై అందజేసిన డ్రోన్లను వారు పంపిణీ చేసి, వాటి పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం కనిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాగుకు సమాయత్తం – ఖరీఫ్ 2025 కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సబ్‌డివిజన్ ఏడీఏ షేక్ జైనులబ్దిన్, వ్యవసాయ శాఖ అధికారులు టి. శిల్ప, అబ్రహం లింకన్, ఎన్. రంగకష్ణ, మధుబాబు, రవికుమార్, ఉద్యాన శాఖ అధికారి విష్ణు ప్రియ, విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, ఎంపీఈవోలు, విహెచ్ఎలు పాల్గొన్నారు.

మార్కాపురం జిల్లాపై

స్పష్టత ఏదీ..?

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం జిల్లా ఏర్పాటులో నాన్చుడు ధోరణి కొనసాగుతోంది. జిల్లా అంశంపై హామీ ఇచ్చిన అధినేతలు పల్లెత్తు మాట కూడా మాట్లాడటం లేదు. మొన్న చంద్రబాబు, నిన్న పవన్ కళ్యాణ్‌లు పర్యటనలు మార్కాపురం వేదికగా ముగిసినా మార్కాపురం జిల్లా అంశాన్ని ప్రస్తావించకపోవడం శోచనీయం.

ఒంగోలు కేంద్రంగా ఇప్పటి ప్రకాశం జిల్లాతో మార్కాపురం ప్రాంత ప్రజలు పరిపాలనా సౌలభ్యాన్ని కోల్పోయారు. ఒంగోలు సుదూరంలో ఉండటమే అందుకు కారణం. మార్కాపురం డివిజన్‌లోని కొమరోలు, గిద్దలూరు, అర్ధవీడు, పుల్లలచెరువు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల పరిధిలోని కొన్ని గ్రామాలు 200 కిలో మీటర్ల దూరానికి పైగా ఉన్నాయి. పెద్దారవీడు, కంభం, బేస్తవారిపేట, తర్లుపాడు మండలాల్లోని గ్రామాలు 100 కిలో మీటర్ల దూరానికి పైగా ఉన్నాయి. మార్కాపురం ప్రాంతానికి సమీపాన ఒంగోలు లేనందున పాలనా సౌలభ్యం లేదనే చెప్పాలి. అత్యవసర పనుల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మార్కాపురం కేంద్రంగా జిల్లా ఎప్పుడో ఏర్పాటు కావాల్సి ఉంది. వైసిపి ప్రభుత్వ కాలంలో జిల్లాల సంఖ్య పెరిగింది. ఆ జాబితాలో మార్కాపురం జిల్లాగా



లేకపోవడం దారుణమనే చెప్పాలి.

మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశాన్ని సార్వత్రిక ఎన్నికల సమయంలో టిడిపి అధినేత చంద్రబాబు ప్రస్తావించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లాగా ఏర్పడబోతోందని హామీ ఇచ్చారు. మార్కాపురం జిల్లాగా ప్రకటించిన తరువాతనే మార్కాపురం వస్తానని ఇక్కడి ప్రజలను నిమ్మించారు. ఈ విషయంపై కూటమిలో భాగమైన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ కూడా ఎన్నికల వేళ మార్కాపురం జిల్లా అంశాన్ని ప్రస్తావించారు. కూటమిని ఆదరించండి... మార్కాపురం జిల్లా చేస్తామని చెప్పడం జరిగింది.

టిడిపి నాయకత్వంలోని కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. ఇంకేముంది మార్కాపురం జిల్లా అవడం ఖాయమని జనం అనుకున్నారు. ఇప్పటి ఏడాది కాలం పూర్తయింది. జిల్లా అంశం మాత్రం అధినాయకుల నోట ప్రస్తావ–నకు రావడం లేదు. గత మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో మార్కాపురంలో జరిగాయి. ఎవరో ప్రశ్నిస్తే గానీ జిల్లా చేస్తాంలే అని వెటకారంగా చంద్రబాబు చెప్పడం జరిగింది. ఈ నెల 4వ తేదీన ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కూడా మార్కాపురం రావడం జరిగింది. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ. 1290 కోట్ల వ్యయంతో నిర్మించే తాగునీటి పథకాన్ని శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మార్కాపురం జిల్లా గురించి చెప్పాలని వేదిక ముందున్న జనం కోరుతున్నా పవన్ కళ్యాణ్ స్పందించలేదు. ఈ జిల్లాకు చెందిన మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాత్రమే జిల్లా ఏర్పాటు చేస్తామని చెప్పారు. మంత్రి స్వామితో పాటు మంత్రి గొట్టిపాటి రవికుమార్, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిలు పదేపదే జిల్లా చేస్తామని చెప్పడమే కానీ... అది ఎప్పుడన్నది తేల్చడం లేదు. స్థానికంగా నేతలు చెబుతున్న మాటలపై జనంలో కూడా నమ్మకం సన్నగిల్లుతోంది. మార్కాపురం జిల్లాగా చేయడంలో నాన్చుడు ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

రాజ్యాంగంపై అవగాహన అవసరం

- 20 నుంచి 'రాజ్యాంగం-కనీస అవగాహన'పై పోటీలు' కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి అందించిన హక్కులు, బాధ్యతలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రకాశం జిల్లా అభివద్ధి వేదిక అధ్యక్షులు చుండూరి రంగారావు పేర్కొన్నారు. స్థానిక ఎంసిపి భవన్‌లో ప్రకాశం జిల్లా అభివద్ధి వేదిక, ఓపిడిఆర్, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి రంగారావు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన రచించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీ నుండి అమల్లోకి వచ్చిందన్నారు. రాజ్యాంగమే భారత దేశపు ధర్మశాస్త్రమని, భారత పౌరులందరూ విధిగా అంగీకరించాలన్న నిబంధన ఉందన్నారు. రాజ్యాంగంపై కనీస అవగాహన కలిగి ఉండటం తప్ప మరో మార్గం లేదన్నారు. భారత రాజ్యాంగం దేశంలోని పౌరులందరికీ ఆరు రకాలైన ప్రాథమిక హక్కులను అందించిందన్నారు. 14 లోపు సంవత్సరాల బాల బాలికలకు ఉచిత నిర్బంధ విద్య అందజేయాలని భారత రాజ్యాంగ పేర్కొందన్నారు. దేశంలోని సహజ సంపద పై అందరికీ సమాన హక్కు ఉందని, ఏ కొద్దిమంది చేతిలో సహజ సంపద ఉండటం భారత రాజ్యాంగానికి విరుద్ధమైన చర్యని తెలిపారు. నేటి ప్రభుత్వాలు రాజ్యాంగ నిబంధనలు తుంగలో తొక్కి తమ ఇష్టానుసారంగా దేశ సంపదను కొద్దిమందికి దోచిపెడుతుందన్నారు. అందరికీ సమాన న్యాయం హక్కు కల్పించిందని, దేశంలోని ప్రజలందరూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరు తెలుసుకున్న సర్వతోముఖాభివృద్ధి అవుతుందన్నారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడే పాలన సాగించాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించేందుకు, ఆసక్తి పెంచేందుకు ఈనెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఒంగోలులోని దేవుడి చెరువు రోడ్డులో గల ఎంసిపి భవన్‌లో భారత రాజ్యాంగం కనీస అవగాహన అనే అంశంపై వక్తృత్వపు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు, యువతకు వేర్వేరు విభాగాలలో నిర్వహించే పోటీలలో విజేతలకు జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతిగా రూ. 6 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 5 వేలు, తతీయ బహుమతిగా రూ. 4 వేలు, మరో పదికి పైగా కన్సోలేషన్ బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. యువత విభాగంలో ప్రథమ బహుమతిగా రూ. 10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 8 వేలు, తతీయ బహుమతిగా రూ. 7 వేలు, మరో 10కి పైగా కన్సోలేషన్ బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. బహుమతి మరియు, సర్టిఫికెట్ల బహుకరణ కార్యక్రమం ఆగస్టు మొదటి వారంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ సమాచార హక్కుల కమిషన్ విశ్రాంత కమిషనర్, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక విశ్రాంత కమిషనర్ మాడభూషి శ్రీధర్ చేతుల మీదుగా అందించనున్నట్లు తెలిపారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పేరయ్య మాట్లాడుతూ చదువు, సాంఘిక న్యాయం అందరి హక్కు అని పేర్కొన్నారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యున్నత రాజ్యాంగం భారతదేశానిదేనన్నారు. ప్రజలందరూ రాజ్యాంగం అందించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు మాట్లాడుతూ రాజ్యాంగానికి కట్టుబడి ప్రభుత్వాలు పాలన సాగించాలన్నారు. సొంత ఏజెండాను ముందుకు తీసుకువస్తే చెల్లదన్నారు. ఇటీవల కాలంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని మార్పు చేయాలని ఆలోచన చేస్తున్నాయని, వారి ఆలోచనలు తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ధూళిపాళ్ళ వెంకటేశ్వర్లు గడ్డం మురహరి రావు ప్రసంగించారు. ఈ సందర్భంగా కార్యక్రమం కరపత్రాన్ని విడుదల చేశారు.